



# మీ భౌతిక దాడులకు బెదరం

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

చింతకాని మండలం లోని కొదమూరు గ్రామంలో ఇటీవల స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్–సీపీఎం కూటమి సాధించిన విజయాన్ని జీర్ణించుకోలేని కొందరు అరాచక శక్తులు, ఓటమి పాలైన పార్టీకి చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడటాన్ని కూటమి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, "తమ కూటమి ప్రజలకు అండగా ఉంటుందని, అరాచక శక్తులు, వారికి సహకరిస్తున్న అధికారులు పద్ధతి మార్చుకోవాలని తీవ్ర హెచ్చరిక చేశారు. ఒకప్పుడు కొదమూరు ప్రాంతంలో ఘర్షణలు, రాజకీయ విభేదాలు కొత్త కాదని, అరాచకం రాజ్యమేలిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గారు విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు వంటి సౌకర్యాలు ప్రజలకు అందించాలని, ప్రతి తెలంగాణ బిడ్డ పార్టీలకు అతీతంగా సంతోషంగా ఉండాలని భావించారని తెలిపారు. ఈ కారణంగానే తెలంగాణలో రాజకీయ ఘర్షణలు 90% వరకు తగ్గిపోయాయని అన్నారు. అధికార పార్టీ అండగా ఉన్నప్పటికీ ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయలేని కొందరు వ్యక్తులు, బిఆర్ఎస్–సిపిఎం కూటమైతేనే గ్రామాన్ని అభివృద్ధి చేస్తుందని ప్రజలు ఇచ్చిన తీర్పును సహించలేకపోతున్నారని ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపడ్డారు. "మీరు భౌతిక దాడులు చేసినంత మాత్రాన ఇక్కడ బెదిరిపోయేవారు, పారిపోయేవారు లేరు. మీకు ప్రజలే ఓటు ద్వారా సమాధానం చెప్పారు. గంటల వ్యవధిలోనే ఆ గెలుపును సహించలేక మీ మీద దాడి చేయడం జరిగింది" అని తెలిపారు. తాత్కాలికంగా ఆనందం పొందవచ్చు కానీ, తాము భయపడే వాళ్ళం కాదని, తమకు ప్రజాబలం ఉందని స్పష్టం చేశారు. "రామారావు గారిని చంపినా పాతర్లపాడు వంటి ఊరిలోనే విజయాన్ని ఆపలేకపోయారు. అధికారమనేది ఎవరికీ శాశ్వతం కాదు" అని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన శక్తులకు వత్తాసు పలుకుతున్న ఒక పోలీస్ అధికారిపై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నీకు నెలకు జీతం వస్తుంది. నువ్వు ప్రజలు రక్షించే వాడిలాగా ఉండు. కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా ఉండబాకు... నీకు ఉద్యోగం ఇచ్చింది గుండాల వత్తాసు పలుకడం కోసమా? అని ప్రశ్నించారు". ఈ విషయంలో తాము సీపీతో కూడా మాట్లాడతామని, ఇదే పద్ధతి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమల్ రాజు గారి నాయకత్వంలో ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని, దళితులకు కేసీఆర్ దళిత బంధు ఇచ్చే విషయంలో కూడా పక్షపాతం చూపలేదని గుర్తు చేశారు. "బిఆర్ఎస్, సీపీఎం పార్టీల జిల్లా కమిటీలు మీకు అండగా ఉంటాయి. మీరెవరూ భయపడాల్సిన అవసరం లేదు, ఇబ్బంది పడొద్దు. మీకు ఏమైనా సమస్య ఉంటే ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం" అని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ బిచ్చాల తిరుమలరావు చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు బొడ్డు వెంకట రామారావు, నూతనంగా ఎన్నికైన సర్పంచి భయ్యా నాగ రాణి, సిపిఎం నాయకులు మాదిన్ని రవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గురిజాల హనుమంతరావు, గుడిమల్ల దేవ స్వామి, బొగ్గారపు రాంబాబు, సిపిఎం నాయకులు నక్కనబోయిన శాంతారావు, తిగుళ్ల నాగులు మరియు తదితరులు పాల్గొన్నారు.